# తీరని కోరిక

శ్రీమతి సూర్యదేవర అన్నపూర్ణదేవి

"నాన్నా నాకు పెండ్లి వద్దు" అంది సుశీల తన తండ్రితో. ఏమిటమ్మా అలా అంటున్నావు. నిన్ను అవివాహితగా ఉంచితే సంఘం నన్ను దూషించదూ! నేను నల్గురిలో ఎలా తలెత్తుకు తిరగ్గలను? ఎవరినో ఒకరిని చూచి నీకు ముడిపెడితే తప్ప నాకు బాధ తీరి నట్లుండదమ్మా" అన్నాడు తండ్రి రామయ్య.

సుశీల:—అదికాదు నాన్నా! మీరు నన్ను ప్రేమిస్తున్నారా? సంఘాన్నా? మీరు నన్ను ప్రేమిస్తుంటే సంఘాన్ని ఎదిరించండి. ఏమి ఒక స్త్రీ అవివాహితగా ఉన్నదంటే సంఘంలో గుసగుసలు బయలుదేరుతాయి. పురుషుడు అవివాహితుడుగా ఉన్నాడంటే సంఘం నోరే మెదపదు. స్త్రీకికూడ హృదయముందని నేను నిరూపించగలను. నాన్నా మీరు నా పెండ్లికి చేయు ఖర్చు నా చదువుకుపయోగించండి. నా వలన మీరు ఏ అపకీర్తి పొందరు. నా కోరిక మన్నించండి. అన్నయ్యకు చెప్పించినట్లు నాకుకూడ చదువు చెప్పించితే ఇప్పటికి ఎంతో చదువు చదివేదాన్ని. ప్రతి స్త్రీ పురుషునితోపాటు డిగ్రీలు పొందాలని కాదు నా ఉద్దేశ్యం. విద్యాతృష్ణగల నా లాంటి స్త్రీలకు చదువుకునే అవకాశమిచ్చి స్త్రీల ప్రతిభను వికసింపచేయాలని నా కోరిక. నేను నా భావిజీవితములో చేయవలసినవి ఎన్నో ప్లానులు వేసుకొనియున్నాను. వాటన్నిటిని "గాలిమేడలు" చేయవద్దు.

రా:—అమ్మా! సుశీలా! అదికాదు; స్త్రీ అవివాహితగా ఉండుట మన మత ధర్మంకాదు.

సు:—మతముపేరు చెప్పి నా మనస్సు మార్చ చూస్తున్నారా? నాన్నా! అవివాహితగా ఉండి అఖండ బ్రహ్మచర్యమునకు తన జీవితమును అంకితము చేసిన హిందూ స్త్రీ గార్గిని మఱచిపోయానన్నారా? లేక మీరు మఱచిపోయి అట్లు మాట్లాడుతున్నారా?

రా:—మాటలతో పనిలేదు. చేతనైతే నీ బిడ్డలను నీ ఇష్టమొచ్చినట్లు తయారుచేసుకోవచ్చు. కాని నీపై నాకు పూర్ణాధికారమున్నది కాబట్టి నేను నీ పెండ్లిచేసితీరుతాను. నన్ను నల్గురిలో నవ్వుల పాలుచేయకు.

అదివిన్న సుశీల ఇక అక్కడ ఉండలేకపోయింది. మెల్లగా గదిలోనికి వెళ్ళింది. ఆమెకు ప్రపంచమంతా అంధకారంగా తోచింది. తను ఒక కుగ్రామంలో జన్మించింది. ఆ గ్రామం నాగరికతలో చాల వెనుకబడియున్నది. స్త్రీ విద్యంటే వారికి దాని విలువ తెలియదు. తమ సంతానాన్ని ఏవిధంగా పెంచవలసింది, తమ పసిబిడ్డలను ఏవిధంగా ఉంచవలసిందికూడ వారికి తెలియదు. అందువలన తను ఆ గ్రామాన్ని అభివృద్ధిలోకి తేవాలని ఊహించింది. తనను తన తండ్రి చిన్నతనంలో పెద్దగా చదివించలేదు. తన మేనమామల ఇంటిదగ్గరే 5, 6 తరగతుల వరకు చదువుకుంది. ఆ రోజుల్లో తనకు చదువుమీద అంత ప్రేమకూడ ఉండేదికాదు. కాని ఇప్పుడు తనకు దేశకాల పరిస్థితులు అవగాహనమయ్యాయి. మొన్న తను మేనమామగారింటికి వెళ్లినప్పుడు ఆ పక్కింటి సుబ్బయ్యగారి అమ్మాయిలిద్దరూ బి. ఏ. వరకు చదువుకున్నారు. ఎంతో సరదాగా ఉంటారు. గ్రామంలోని అవిద్యావతులైన స్త్రీలకు విద్య చెప్పుటంటే వారికి చాల ప్రీతి. ప్రతి నిముషంవారు స్త్రీ విద్యా వ్యాప్తికి, స్త్రీ శ్రేయస్సుకే ఉపయోగించ ప్రయత్నిస్తారు. వారివలన ఆ గ్రామంలోని స్త్రీలు ముందుకు రాగలిగారు. ఆ స్త్రీలకు స్వతంత్ర భారతదేశంలో వారికిగల హక్కులు, వారి బాధ్యత బాగా విపులీకరించి చెప్పుతారు. వారి వలనే తనకుకూడ ఈ విద్యాతృష్ణ కలిగింది. తనుకూడ చదువుకొని తన గ్రామాన్ని విద్యాకేంద్రంగా మార్చ ఉవ్విళ్ళూరింది. కాని తన తండ్రి ఇంత నిరాశాపూరితమైన జవాబిస్తాడని అనుకోలేదు. తన తండ్రి కొద్దో గొప్పో చదువుకున్నప్పటికి ఆయన దృష్టిలో స్త్రీ విద్యకు విలువలేనందుకు చాల విచా


రించింది. తన ఊహలన్నీ గాలిమేడలయ్యాయని ఒక్క నిట్టూర్పు విడచింది. కాని తన వివాహానంతరమైన తన పతిదేవుడు అనుమతించితే స్త్రీలలో కొంతవరకైనా చైతన్యము తేగలనని తనను తను ఊరడించుకున్నది.

రామయ్య ఇక తన కూతురి పెండ్లి చేయకపోతే తన మాట మీరిపోతుందని భయపడ్డాడు పాపం! కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు ఒక సంబంధం కుదుర్చుకొచ్చాడు. అతనికి షుమారు 50 సంవత్సరముల వయసు ఉంటుంది. ఆస్తయితే 4 లక్షల వరకు ఉంటుంది. ఇదివరలో ఒక భార్య నిస్సంతానముతోనే గతించింది. వయస్సు ఎంత ఉన్నప్పటికి చదువుకున్నవాడు, ఆస్తికలవాడు కాబట్టి అదృష్టముంటే తన కోరిక నెరవేరగలదని సంతోషించింది. ఇక తన చదువుకూడా కొంతవరకైనా సాగిపోగలదని ఉవ్విళ్ళూరింది అమాయక ప్రపంచంలోని సుశీల.

సుశీల వివాహమై అత్తవారింటికి వచ్చింది. కాని ఇక్కడకూడ తన కోరిక "తీరనికోరిక"గానే పరిణమించింది. ఒక రోజున సుశీల ఎంతో వినయముతో తన విద్యాతృష్ణ ప్రకటించి తన కోరిక తీర్చవలెనని ప్రార్థించింది. అందుకు భర్త "నీ ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించవచ్చని ఇది ఒక వంక దొరికిందా? ఇక్కడ నీ ఆటలు సాగవు. ఇంటిలోనుండి బయటకు అడుగుపెట్ట వీలులేదు"ని శాసించాడు. ఆ మాటలతో సుశీల ఆశలన్నీ అడియాసలైనాయి. ఆమె నిర్మించుకున్న ఊహాసౌధములన్నీ గాలిమేడలైనాయి. సుశీల ఎవరితోనైన మాట్లాడిందంటే ఆయనకు పెద్ద అనుమానము. ఎవరితోను మాట్లాడగూడదు. ఆమెను బయటముఖం చూడనివ్వడు ఆ మూర్ఖుడు. ఆ ఆస్తిమీద తనకేవిధమైన అధికారము లేదు. ఆ విశాలమైన భవనములో ధన సంకెళ్లతో బంధింపబడ్డది నిస్వార్థియైన సుశీల. స్త్రీలతో మాట్లాడినప్పటికి ఆమె కెవరో ఏదోచెప్పి పాడుచేస్తారని అతనికి పెద్దభయం. తన ఇష్టమొచ్చినట్లు ఊరంతా తిరిగి సకలభోగాలనుభవించి అర్ధరాత్రికి ఇంటికివస్తే అప్పటివరకు పాపం! సుశీల ఒక్కతే ఇంట్లో బిక్కు బిక్కు మంటూ ఉండాలి.

స్వతంత్ర పిపాసియైన సుశీల ఎంతధనమున్నప్పటికి అస్వతంత్రమైన జీవితానికి తృప్తిపడలేదు. ఆమెకు తన భర్తనడత ఏమినచ్చలేదు. అతని హృదయములో అభ్యుదయభావాలు కంచుకాగడాపెట్టి చూచినా కనుపించవు. తనకు వివాహమై 5 సంవత్సరములైంది. కాని ఇంతవరకు సంతానము కలగలేదు. తన ఆశయాలను ఆచరణలో పెట్టే అస్కారములేదు. ఇక తను ఎవరికొరకు జీవించాలి. దుర్మార్గుడైన భర్త కొరకా? అవును-సంఘానికి కట్టుపడితే ఎలాంటి వాడైనా భర్త కొరకు జీవించుట భారత స్త్రీ పవిత్ర ధర్మం. కాని ఏ విధంగా ఆలోచించిన ప్రగతివాదియైన సుశీలకు మనశ్శాంతి కలుగలేదు. ఆమెలోని ఇదివరకటి ఉత్సాహం గతించింది. తన సంఘంలో ఇంకను కరుడుకట్టియున్న కుళ్లునుచూచి కుములుతూఉంది. తల్లిదండ్రులు మంచికోరుతారంటారు. వారిదృష్టికి ధనమే ప్రప్రథమంగా తగుల్తుంది. తమబిడ్డ ఏడంతస్థుల మేడమీద మసలుతూ ఉందని సంతోషిస్తారు. కాని వారస్వేచ్ఛ సుఖముండుటే ప్రధానంగా భావించరు. ఇక నేను ఈ సంఘంలో ఈ విధంగా బంధింపబడి జీవించలేను. మరొక జన్మలోనైన భగవంతుడు నా కోరిక తీర్చుగాక! అని భగవంతునియందే నమ్మకముంచుకొని ఆమె తన దుఃఖజీవితాన్ని అతి భారంతో వెళ్లబుచ్చుతూఉంది.

కొన్నిరోజులు గడచాయి. సుశీల చిక్కి శల్యమై పోయింది. ఆమెకు ఇప్పుడు జ్వరముకూడ వస్తూ ఉంది. ఎందరు డాక్టర్లు వచ్చినను ఆమె వ్యాధితిరుగు ముఖముకాలేదు. ఇక సుశీల జీవించు ఆశలేదు. ఆమెను చూచుటకు తల్లి - తండ్రి అన్న, తమ్ముడు అందరూ వచ్చారు. అందరూ దుఃఖసముద్రంలో మునిగియున్నారు. సుశీల ఒక్కసారి తండ్రివైపు చూచి ఇలా అంది:- నాన్నా! మీరు సంఘాన్ని ప్రేమిస్తున్నారు. దాని ఆజ్ఞానుసారము నన్ను వివాహితను చేశారు. మీరు ధనమును ప్రేమిస్తున్నారు. ధనవంతురాలను చేశారు. కాని నాకు ఇక్కడ ఎలాంటి అధికారములేదు. నేను లోకానికి ఒక ధనవంతురాలనేకాని దానాధర్మము చేయుటకు చిల్లికాన్సి దగ్గరకూడా నాకేవిధమైన అధికారములేదు. తినుటకు, దాన్నిచూచి ఆనందించుటకేగాదు దానిని సద్వినియోగము చేయుట చేతకావాలి. మీ కోరిక తీర నేను వివాహితగా ధనవంతుని భార్యగా యున్నాను. ఇదేవిధంగా వెళ్ళిపోతున్నాను. ఈ జన్మలో నా కోరిక "తీరని కోరిక" గా మారింది. మరో జన్మలో విద్యావంతురాలనై స్త్రీ సమాజంలోని యువ సభ్యురాండ్రను చేతనైనంతవరకు విద్యావతులను చేయప్రయత్నిస్తా; గార్గిలాంటి విదుషీమణులను తయారు చేస్తానంటూ కన్నుమూసింది. అక్కడఉన్న బంధువర్గమంతా ఒక్కసారి గొల్లుమన్నది. అలాంటి ఉత్తమ స్త్రీని పోగొట్టుకున్న స్త్రీ సమాజంకూడ ఆమెకు అశ్రువులతో అభిషేకం చేసింది.




# ఏజంట్లు కావాలి

ఈ దిగువ పట్టణములలో మా పత్రికను తమ సొంత బాధ్యతపై అమ్ముటకు ఏజంట్లు కావలెను.

బొంబాయి, సికిందరాబాద్, గుంటూరు, కడప, కర్నూలు, చిత్తూరు, బాపట్ల, చీరాల, ఒంగోలు, పుత్తూరు, పాకాల, తిరుపతి, కాళహస్తి, గూడూరు బెంగుళూరు.

ఏజంట్లుగా నుండగోరువారికి 100కి - 20 రు॥ల కమీషను, ఒక ఫ్రీకాపీ యివ్వబడును. ఇతర వివరములకు వ్రాయండి!

మా పత్రికకు అడ్వర్టైజుమెంటులను కాన్వాస్ చేయువారికి మంచికమీషను యివ్వబడును.

గృహలక్ష్మి కార్యాలయం

రాయపేట, మద్రాసు 14.